క్లుప్తంగా

శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం ప్రారంభం



విష్ణు సహస్రనామ పారాయణంలో పాల్గొన్న భక్తులు

బేతంచెర్ల: పూదోట ఆశ్రమంలో లోక కళ్యాణర్థం జూన్ 30 వరకు నిర్వహించే శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్ర సామూహిక పారాయణం ఆదివారం ప్రారంభమైంది. ఆశ్రమ కమిటీ సభ్యులు గుండా గోపాలు, ఈశ్వర్ ప్రసాద్, గౌరి హుసేన్‌రెడ్డి, రామకృష్ణ, నాగ మోహన్, డాక్టర్ నరసింహులు ఆధ్వర్యంలో శ్రీమహా విష్ణువుకు ప్రత్యేక పూజల అనంతరం భక్తులు సామూహిక పారాయణంలో పాల్గొన్నారు. నిర్విరామంగా 41 రోజుల పాటు జరిగే ఈ పారాయణంలో భక్తులు పాల్గొని భగవంతుని అనుగ్రహానికి పాత్రులు కావాలని ఆశ్రమ కమిటీ సభ్యులు కోరారు.

తాగునీటి సమస్యకు ప్రత్యామ్నాయ చర్యలు



ట్యాంకర్ల నుంచి తాగునీటిని పట్టుకుంటున్న కాలనీవాసులు

బేతంచెర్ల: పట్టణంలోని దుర్గాపేట కాలనీల్లోని పైపు లైన్లు మరమ్మతుల నేపథ్యంలో తాగునీటి సమస్య తలెత్తింది. స్పందించిన నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, కమిషనర్ రమేష్ బాబు యుద్ధప్రాతిపాదికన తాగునీటి ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేయించారు. దీంతో కాలనీవాసులు చైర్మన్, కమిషనర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పైపులైన్లకు మరమ్మతులు చేయించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చైర్మన్ తెలిపారు.

పాలిసెట్‌లో ప్యాపిలి విద్యార్థి ప్రతిభ



మనోజ్ కుమార్

ప్యాపిలి: స్థానిక హుసేనాపురం వీధిలో నివాసం ఉంటున్న వంశీ చౌదరి, సుహాసిని కుమారుడు మనోజ్ కుమార్ పాలిసెట్‌లో ప్రతిభ చాటుకున్నాడు. పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షలో 120 మార్కులకు గాను 94 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో 1526 వ ర్యాంకును సాధించాడు. ఎటువంటి కోచింగ్ తీసుకోకుండా పరీక్షలకు ఇంటి వద్దే సన్నద్ధం అయినట్లు మనోజ్ కుమార్ తెలిపాడు. ప్రతిభ చాటుకున్న మనోజ్ కుమార్‌ను స్థానికులు అభినందించారు.

మైసూరమ్మకు బోనాల సమర్పణ



ప్రత్యేక అలంకరణంలో అమ్మవారు

కోవెలకుంట్ల: మండలంలోని కంపమల్ల గ్రామంలో వెలసిన మహిషాసుర మర్ధిని(మైసూరమ్మ) ఆలయంలో అమ్మవారికి ఆదివారం భక్తులు బోనాలు సమర్పించారు. సర్పంచ్ లోకేష్‌రెడ్డి, ఎంపీటీసీ సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పూజ కార్యక్రమాలు సాగాయి. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అన్నదానం చేశారు.

మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న దృశ్యం

డోన్ టౌన్: పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి భర్త దివంగత చెరుకులపాడు నారాయణ రెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం స్థానిక పాతబస్టాండ్‌లో వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు. తాపలకొత్తూరుకు చెందిన వెంకటేశ్వరరెడ్డి, పులిచెర్లకు చెందిన చంద్రమోహన్‌గౌడ్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ప్రజలకు మజ్జిగ పంపిణీ చేపట్టారు.

ప్రభుత్వాసుపత్రిలో రొట్టె, గుడ్డు పంపిణీ



పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తున్న దృశ్యం

డోన్ : స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ప్రతి ఆదివారం రోగులకు హోసన్నా వృద్ధాశ్రమం నిర్వాహకుడు జాన్ ప్రభాకర్ అందజేసే రొట్టె, పప్పు, గుడ్డు పంపిణీ కొనసాగింది. గర్భిణులు, బాలింతలతోపాటు రోగులకు సౌకర్యార్థం తమవంతుగా పౌష్టికాహారం పంపిణీ చేస్తున్నామని జాన్‌ప్రభాకర్ తెలిపారు.

లావాదేవీలు... నగదు రహితం!

- స్వైకాష్...ఓన్లీ స్కానర్
- ఆన్‌లైన్ చెల్లింపులకే జనం మొగ్గు
- ఫేమెంట్ యాప్‌లకు పెరిగిన డిమాండ్
- గ్రామాలకూ తాకిన డిజిటల్ సేవలు



రాఘవరాజుపల్లె టీ కొట్టు వద్ద నగదు చెల్లించేందుకు స్కానింగ్ చేస్తున్న వినియోగదారుడు,(ఇన్‌సెట్)కూల్ డ్రింక్స్ షాపులో క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేసిన దృశ్యం

కొలిమిగుండ్ల: బ్యాంక్ అకౌంట్‌లో డబ్బులు... చేతిలో స్మార్ట్ ఫోన్ ఉంటే చాలు... జేబులో రూపాయి లేకపోయినా అన్నిపనులూ అయిపోతున్నాయి. నచ్చిన ప్రదేశాలు తిరిగి రావచ్చు, నచ్చిన హోటల్ తినొచ్చు. నగదు రహిత లావాదేవీలు తగ్గిపోయి ఆన్‌లైన్ చెల్లింపులు విస్తృతమయ్యాయి. పెద్ద నోట్లు రద్దు తర్వాత ప్రభుత్వాలు డిజిటల్ పేమెంట్లను ప్రోత్సహించేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టింది. ఆ సమయంలో ప్రజలు ఆసక్తి చూపకపోయినా పెద్ద షాపింగ్ మాల్స్‌ల్లో క్రెడిట్, డెబిట్ కార్డులతో చెల్లింపులు సాగేవి. డిజిటల్ పేమెంట్స్ జరిపితే ఇతరుల ఖాతాల్లోకి వెళ్తుందనే అపోహలు అప్పట్లో బలంగా వినిపించేవి. అందుకే వాటి పట్ల ఆనాసక్తి చూపారు. 2020లో కరోనా మహమ్మారి మనిషి జీవనశైలినే మార్చేసింది. దీంతో నగదు రహిత లావాదేవీల్లో పూర్తిగా మార్పులు వచ్చాయి. ప్రస్తుతం వ్యాపార సముదాయాల్లో రూపాయి వస్తువు కొనుగోలు చేసినా స్కానర్ల ద్వారా డబ్బు జమ చేస్తుండటం విశేషం. జిల్లా వ్యాప్తంగా చిరు వ్యాపారుల నుంచి పెద్ద పెద్ద మాల్స్ వరకు వేలల్లో ఉన్నాయి. డిజిటల్ పేమెంట్ల రూపంలో జిల్లాల్లో లక్షల్లో లావా దేవీలు జరుగుతున్నాయి.

ఎక్కడా చూసినా స్కానర్లే

ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం, అమెజాన్, భారత్‌పే తదితర పేమెంట్ యాప్‌లు పూర్తి స్థాయిలో వాడుకలోకి వచ్చేశాయి. ఎక్కడా చూసినా ఆన్‌లైన్ సేవలు విస్తృతమయ్యాయి. ఏ దుకాణంలో చూసినా పేమెంట్ యాప్‌లకు చెందిన స్కానర్లు దర్శనమిస్తున్నాయి. టీ కొట్టు నుంచి హోల్‌సేల దుకాణాల వరకు స్కానర్లు అందుబాటులోకి వచ్చాయి. వినియోగదారులు సైతం క్యాష్ బదులుగా డిజిటల్ చెల్లింపులకు ప్రాధాన్యమిస్తున్నారు. నిత్యావసర సరుకుల దుకాణాలు, ఫ్యాన్సీ, మెడికల్ స్టోర్స్, పెట్రోల్ బంకులు, బట్టల దుకాణాలు, మొబైల్ షాపులు ఇలా ఒకటి కాదు టీకొట్టు, బజ్జీల కొట్లు దగ్గర నుంచి తోపుడు బండ్లు, వీదుల్లోకి వెళ్లి వ్యాపారాలు నిర్వహించే ప్రతి వ్యాపారి వద్ద స్కానర్ల ద్వారా పేమెంట్స్ జరుగుతున్నాయి. బస్సు, రైలు టికెట్లు, విద్యుత్ బిల్లులు, డీటీహెచ్ సేవలు సైతం పొందుతున్నారు. ఆన్‌లైన్ వివధ రకాల వస్తువులు ఆర్డర్ ఇచ్చే సమయంలో ఆన్‌లైన్‌లో ముందుగానే నగదు జమ చేస్తున్నారు. ప్రభుత్వం తాజాగా ఆర్డీనరీ, ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లోనూ ఫోన్‌ఫే స్కానర్లు ఏర్పాటు చేయడంతో ప్రయాణికులకు సౌలభ్యంగా మారింది. డిజిటల్ సేవలు వినియోగదారులతో పాటు వ్యాపారులకు సులభతరంగా మారింది. చిరు వ్యాపారుల నుంచి మొదలు కొని పెద్ద వ్యాపారులు హోల్ సేల్‌గా సరుకులు, వివిధ రకాల వస్తువులు కొనుగోలు చేయాల్సి వచ్చినపుడు ఫేమెంట్ యాప్‌లు మరింత సులభతరం అయ్యాయి. నగదు తీసుకొని పట్టణాలకు వెళ్లాల్సి అవసరం లేకుండానే ఉన్న చోట నుంచే నగదును చెల్లించి ట్రాన్స్‌పోర్టు ద్వారా సరుకులు తెప్పిస్తుండటంతో సమయం, ఖర్చులు ఆదా అవుతున్నాయి. యువత నుంచి వృద్ధుల వరకు పేమెంట్ యాప్‌లపై అవగాహన పెంచుకున్నారు.

వ్యాపారుల వద్దకు క్యూఆర్ స్కానర్లు:

డిజిటల్ చెల్లింపుల ప్రాధాన్యత పెరిగిపోవడంతో క్యూఆర్ స్కానర్లు వ్యాపారుల చెంతకే చేరుతున్నాయి. ఆయా పేమెంట్ యాప్‌లకు చెందిన డీలర్లు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని టీస్టాళ్లు, హోటళ్లు, తోపుడు బండ్లు, కాయగూరలు తదితర వ్యాపారాలు నిర్వహించే వ్యాపారుల వద్దకు చేరుకొని మొబైల్‌లో వివరాలు నమోదు చేసి ఆల్‌ఇన్ వన్ స్కానర్లు అందజేస్తున్నారు. ఇప్పుడు ఏదుకాణం వద్ద చూసినా ముందుగా క్యూఆర్ కోడ్ స్కానర్లు కనిపిస్తున్నాయి.

సులభంగా ఉంది



టీస్టాల్‌తో పాటు సమ్మర్ కావడంతో ఫ్రూట్ జ్యూస్ వ్యాపారం నిర్వహిస్తున్నా. ఫోన్‌ఫే, గూగుల్ ఫే తదితర యాప్‌లు రావడంతో లావా దేవిలు సులభంగా ఉంటున్నాయి. గతంలో కంటే ఆన్‌లైన్‌లోనే ఎక్కువగా చెల్లింపులు జరుగుతున్నాయి. కష్టమర్లుకు చాలా ఈజీ అవుతుంది. మాకు కూడా సౌకర్యంగా ఉంది. – నాగరాజు, వ్యాపారి, కనకాద్రిపల్లె

చిల్లర సమస్య ఉండదు



పేమెంట్ యాప్‌లు అందుబాటులోకి రావడంతో చిల్లర సమస్య ఎదురు కావడం లేదు. గతంలో చిన్న మొత్తంలో వ్యాపారం చేసినా పెద్ద నోట్లు ఇవ్వడంతో చాలా ఇబ్బందులు పడేవాళ్లం. ముందుగానే ఇతరుల నుంచి చిల్లర సేకరించి పెట్టుకునేవాళ్లం, ఆన్‌లైన్ లావాదేవీలు వచ్చాక చెల్లింపులు చేసి ఆర్డర్ ఇస్తుంటారు. – బాషా, రెస్టారెంట్ యజమాని, కొలిమిగుండ్ల

మార్కెట్‌లోకి స్మార్ట్ స్పీకర్లు

ఆన్‌లైన్ చెల్లింపులు సులభతరం కావడంతో వీటిని ఉపయోగించే వారి సంఖ్య నానాటికి పెరిగిపోతుంది. డిజిటల్ చెల్లింపుల్లో సైతం వ్యాపారులు అప్రమత్తం లేకపోతే మోసపోయే ప్రమాదం లేకపోలేదు. వ్యాపారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు మార్కెట్‌లోకి కొత్తగా స్మార్ట్ స్పీకర్ బాక్స్‌లు అందుబాటులోకి వచ్చాయి. వినియోగదారులు ఆన్‌లైన్ చెల్లింపు చేయగానే ఎంత డబ్బు చెల్లించారో వాయిస్ రూపంలో సమాచారం అందిస్తుంది. రూ.800 నుంచి రూ.3వేల వరకు ఖరీదు అయ్యే స్మార్ట్ స్పీకర్లు మార్కెట్‌లోకి రావడంతో ఎక్కువ మంది వ్యాపారులు స్పీకర్ బాక్స్‌లపై ఆసక్తి చూపుతున్నారు. ప్రత్యేకించి నిరక్షరాస్యులకు స్పీకర్ బాక్స్‌లు ఉపయోగపడుతున్నాయి.

వ్యవసాయానికి విద్యుత్ సరఫరా వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లో తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ రామసుబ్రహ్మణ్యం చెప్పారు. కోవెలకుంట్ల, గుళ్లదూర్తి, కలుగొట్ల విద్యుత్ సబ్‌స్టేషన్ల ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరా వేళలను తెలియజేశారు. జోళదరాశి, భీమునిపాడు, అమడాల, గుంజలపాడు, గుళ్లదూర్తి, పొట్టిపాడు, హరివరం, కొత్తపల్లె, అల్లూరు, రేవనూరు, కలుగొట్ల, కొప్పెర్ల ఫీడర్ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని వివరించారు.

యువతకు ఉపాధి శిక్షణ

డోన్ : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, పీఎంకేవీవై ద్వారా యువతను నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు నియోజకవర్గానికి ఒక స్కిల్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్(న్యాక్) ప్రతినిధి తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఐటీఐ ఎదురుగా ఉన్న న్యాక్ సెంటర్‌లో త్వరలోనే సర్వేయర్, అసిస్టెంట్ ప్లంబర్ జనరల్ కోర్సుల్లో స్వల్పకాలిక శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన వెల్లడించారు. పదవ తరగతి, ఆపై చదివిన నిరుద్యోగ యువతీ యువకులు పైకోర్సులలో శిక్షణ పొందేందుకు 8297234474, 7661828641 నంబర్లను సంప్రదించాలన్నారు. న్యాక్‌లో శిక్షణ పొందిన వారికి వందశాతం ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు నైపుణ్యం పెంపొందించే విధంగా శిక్షణ ఇవ్వడం, తదనుగుణంగా సర్టిఫికెట్లను జారీ, ప్రముఖ కంపెనీలలో ఉపాధి కల్పించడం జరుగుతుందన్నారు. 16 నుంచి 45 సంవత్సరాల మధ్య వయసు అభ్యర్థులు న్యాక్‌తో పాటు నైపుణ్యాభివృద్ధి శిక్షణ సంస్థ అందించే శిక్షణకు అర్హులన్నారు. ఆధార్ కార్డు, సర్టిఫికెట్స్, బ్యాంక్ అకౌంట్ బుక్, బయోడెటా, పాస్ ఫొటోలతో తమను సంప్రదించాలన్నారు.

గస్తీతో నేరాల నియంత్రణ



జూమ్ సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రఘువీర్ రెడ్డి

బొమ్మలసత్రం: రాత్రి సమయంలో పోలీస్ సిబ్బంది నిర్వహించే గస్తీతో నేరాలను నియంత్రించవచ్చని జిల్లా ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం డోన్ సబ్‌డివిజన్ పోలీస్ అధికారులతో జూమ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెండింగ్ కేసులపై దర్యాప్తు ముమ్మరం చేయాలని సూచించారు. హత్యలు, హత్యాయత్నాలు, మహిళపై దాడులు, మిస్సింగ్, ఆస్తి తగాదాలు, రోడ్డు ప్రమాదాల కేసుల్లో సాంకేతికతను వినియోగించుకొని కేసులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. కోర్టులో నడిచే కేసుల్లో నిందితులు తప్పించుకోకుండా తగిన సాక్ష్యాధారాలు సమర్పించి శిక్షలు పడేలా చూడాలన్నారు. ప్రధాన కూడళ్ల వద్ద సీసీ కెమెరాల పనితీరు, కెమెరాల ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రమాదాలు జరిగే ప్రాంతాలను బ్లాక్‌స్పాట్‌లుగా ప్రకటించి ప్రయాణికులను అప్రమత్తం చేసేలా సూచికలు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఆన్‌లైన్, లోన్‌యాప్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఎస్‌బీ డీఎస్పీ సంతోష్, సీఐ దస్తగిరిబాబు, సీఐ జయరాములు, ఎస్ఐ అశోక్, రమేష్ పాల్గొన్నారు.

సమగ్రాభివృద్ధికి కలిసిరావాలి



సమావేశంలో మాట్లాడుతున్న రంగనాయుడు

డోన్ టౌన్ : డోన్ నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన సమరభేరిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై తమతో కలిసి రావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు పిలుపునిచ్చారు. ఆదివారం సమరబేరి జీపు జాత మండలంలోని కొత్రాయి, గుండాల, ఇంద్రాంపల్లె, చనుగొండ్ల, తాడూరు, ఎద్దుపెంట, మిద్దేపల్లి గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఊరువాకిలి, రచ్చ కట్టల వద్ద బహిరంగ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రంగనాయుడు మాట్లాడుతూ భారీ పరిశ్రమను ఏర్పాటు చేసి స్థానిక యువతకు అవకాశం కల్పించాలని, టమాట జ్యూస్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పులిశేఖర్, సుగుణమ్మ, నారాయణ, హుస్సేన్, అబ్బాస్, వాసు, శివయ్య, సుధాకర్, హసీనా, రంగరత్నం, రణత్, పుష్పావతి, రామ్మోహన్, సిద్ధార్థ, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలంలో ఎకరా స్థలం కేటాయించాలి

కర్నూలు(సెంట్రల్): భావసార క్షత్రియుల అన్నదాన కేంద్రానికి శ్రీశైలం పుణ్యక్షేత్రంలో ఒక ఎకరా స్థలం కేటాయించాలని భావసార క్షత్రియ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.శివశంకరరావు డిమాండ్ చేశారు. ఆదివారం జెడ్పీ నుంచి కలెక్టరేట్ వరకు ఆ సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ..తమకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుతో పాటు ఎంబీసీ కింద గుర్తించి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలన్నారు. నామినేటెడ్ పదవుల్లో క్షత్రియులకు ప్రత్యేక కోటా ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పి.వెంకటేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు రవిశంకర్ నాయకులు సుందరరావు పాల్గొన్నారు.

సీఎం మైనారిటీల పక్షపాతి

బొమ్మలసత్రం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద మైనారిటీల పక్షపాతి అని నంద్యాల జిల్లా మైనారిటీ వింగ్ అధ్యక్షుడు యూనుస్‌బాషా అన్నారు. స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని 1,814 మంది హజ్ యాత్రికులకు రూ.14.50 కోట్లు వారి ఖాతాల్లో జమ చేయటం సంతోషకరమన్నారు. హజ్ యాత్రకు ఒక్కో యాత్రికుడికి సాధారణంగా రూ.3.85 లక్షల మే ర ఖర్చవుతుందని, ప్రభు త్వం రూ.80 వేలు యాత్రికుడి ఖాతాలోకి జమ చేయటం అభినందనీయమన్నారు.

ప్రతిపక్షానికి నిజంగా ఖర్మ పట్టింది



స్పీకర్ తమ్మినేని సీతారాం దంపతులకు స్వామి, అమ్మవార్ల జ్ఞాపిక అందజేస్తున్న ఆలయ అధికారులు

శ్రీశైలం టెంపుల్: రాష్ట్రానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో అభివృద్ధి చేస్తుంటే.. ఇదేం ఖర్మ అని ప్రతిపక్షం తిరుగుతోందని, నిజంగానే వారికి ఖర్మ పట్టిందని ఏపీ శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. ఆదివారం ఆయన కుటుంబ సమేతంగా శ్రీశైలం శ్రీభ్రమరాంబా మల్లికార్జునస్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీకి, ఎల్లో మీడియాకు ప్రజల చేతుల్లో వీరబాదుడు తప్పదన్నారు. ప్రతిపక్ష శాసన సభ్యులు సభలో ఉండి ప్రభుత్వం తప్పు చేస్తే ప్రశ్నించాలి కానీ స్పీకర్ పోడియం వద్దకు వచ్చి నిరసన తెలియజేస్తే ఎలా అని ప్రశ్నించారు. లోకేష్ పాదయాత్రను ప్రజలే విశ్వసించడం లేదని, ఇక మా పార్టీ ఆ పాదయాత్ర గురించి ఆలోచించాల్సిన అవసరం లేదన్నారు. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అన్నింటినీ నెరవేర్చాం కాబట్టి 175 సీట్లకు 175 సీట్లు గెలుస్తామని ధీమాగా ఉన్నట్లు చెప్పారు. ప్రతిపక్షాలు ప్రభుత్వంపై విమర్శలు చేయాలి కాబట్టి చేస్తున్నాయి కానీ, లేకుంటే వారికి రోజు గడవదని విమర్శించారు. గతంలో టీడీపీకి మూడుసార్లు అధికారం ఇస్తే ప్రజలకు ఏమీ చేయకుండా.. ఇప్పుడు మళ్లీ అవకాశం ఇవ్వాలని అడగటాన్ని ప్రజలు విశ్వసించడం లేదన్నారు.

ఉత్తమ జీవనానికి సోపానాలు ఇతిహాసాలు

కర్నూలు కల్చరల్: ఉత్తమ జీవనానికి భారత, భాగవత, రామాయణ ఇతిహాసాలు సోపానాలుగా నిలుస్తాయని ఇస్కాన్ ప్రవచకులు వైష్ణోకృప చైతన్య ప్రభు అన్నారు. ఆదివారం స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని జగన్నాథ మందిరంలో శీల ప్రభు పాదుల ప్రేమ విందు కార్యక్రమం నిర్వహించారు. జగన్నాథ్, సుభద్ర, బలదేవ్‌లను ప్రత్యేకంగా అలంకరించి దర్శనం కల్పించారు. అనంతరం వైష్ణోకృప చైతన్య ప్రభు సందేశమిస్తూ భగవద్గీత పఠనం, శ్రవణంతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. జఠిలమైన సమస్యల పరిష్కారానికి మార్గం చూపుతాయన్నారు. పిల్లలకు విద్యార్థి దశ నుంచే దేశభక్తి, ఆధ్యాత్మిక అంశాలపై ఆసక్తి కలిగేలా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం

- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



వలంటీర్లను సత్కరించిన ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

సంజామల: వలంటీర్లు ప్రజలకు స్వచ్ఛందంగా అందజేస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కొనియాడారు. ఆదివారం సాయంత్రం మండలంలోని గిద్దలూరులోని ఫంక్షన్ హాల్‌లో వైఎస్సార్‌సీపీ అదనపు రాష్ట్ర కార్యదర్శి, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ గుండం సూర్యప్రకాష్‌రెడ్డి, ఎంపీడీఓ నాగకుమార్‌తో కలిసి ఎమ్మెల్యే 'వలంటీర్లకు వందనం' కార్యక్రమం నిర్వహించారు. ఉత్తమ సేవలు అందించిన వలంటీర్లను సన్మానించి పురస్కారాలతో సత్కరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికీ అందజేయడంలో వలంటీర్ల పాత్ర కీలకమన్నారు. సేవలను గుర్తించిన ప్రభుత్వం వరుసగా మూడో ఏడాది సత్కరిస్తుందన్నారు. ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా వారి ఇళ్ల వద్దకే పథకాలు చేరవేస్తున్నారని కొనియాడారు. దేశచరిత్రలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో వలంటీర్ల వ్యవస్థ ఏర్పాటు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీన తెల్లవారక ముందే ఠంఛన్‌గా అవ్వతాతలు, దివ్యాంగులు, వితంతు తదిర సామాజిక పింఛన్ లబ్ధిదారులకు నగదు అందజేస్తూ అందరి మన్ననలు పొందుతున్నారని గుర్తు చేశారు. గతంలో పింఛన్ సొమ్ము తీసుకోవాలంటే పడరాని పాట్లు పడేవాళ్లన్నారు. మండలంలో 191 మంది వలంటీర్లు ఉండగా 186 మంది సేవా మిత్ర అవార్డుకు ఎంపికయ్యారన్నారు. సేవా రత్న, సేవా వజ్ర అవార్డుకు ఎంపికైన వారికి సన్మానించి ప్రశంస పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ అస్సద్ అల్లిఖాన్, వైస్‌ఎంపీపీ రాజశేఖర్‌రెడ్డి, నాయకులు బత్తుల రామచంద్రారెడ్డి, ఎస్సీబాబు, మధుసూదన్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈరోజు

వలంటీర్లకు 'వందనం'

కొలిమిగుండ్ల: స్థానిక షిర్డీసాయి ఫంక్షన్ హాల్‌లో సోమవారం ఉత్తమ సేవలు అందించిన వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుబ్బరాజు తెలిపారు. సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర అవార్డులకు ఎంపికైన వలంటీర్లకు సన్మానం చేయనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి హాజరవుతారని చెప్పారు. అన్ని గ్రామ పంచాయితీల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, 16 గ్రామ సచివాలయాల వలంటీర్లు, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు హాజరు కావాలని సూచించారు.

ఫంక్షన్ హాల్ నిర్మాణానికి భూమి పూజ

కొలిమిగుండ్ల: స్థానిక కస్తూర్బా పాఠశాల సమీపంలో రామ్‌కో సిమెంట్ ఆధ్వర్యంలో సోమవారం ఫంక్షన్ హాల్ నిర్మాణానికి భూమి పూజ నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి హాజరవుతున్నట్లు చెప్పారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొనాలని కోరారు.

ఆలయ పునర్నిర్మాణానికి భూమి పూజ

సంజామల: మండల పరిధిలోని అక్కంపల్లెలో సోమవారం ఉదయం రామస్వామి ఆలయ పునర్నిర్మాణానికి భూమి పూజ చేస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచారకార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి హాజరై భూమి పూజ చేస్తారని, నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

నేడు అంబాపురంలో గడప గడపకు మన ప్రభుత్వం

బేతంచెర్ల: మండల పరిధిలోని అంబాపురం గ్రామంలో సోమవారం సాయంత్ర 3 గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంగన్న ఆదివారం తెలిపారు. కార్యక్రమానికి ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, అన్ని శాఖల అధికారులు హాజరవుతారని, గారమంలో విస్తృతంగా పర్యటిస్తారన్నారు. సమస్యలు ఏవైనా ఉంటే వారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవచ్చని సూచించారు.

గాలి వాన బీభత్సం

- కునుకుంట్లలో పిడుగుపాటుకు గడ్డివామి దగ్ధం



కలచట్లలో విరిగి పడిన విద్యుత్ స్తంభం

అవుకు: మండలంలో ఆదివారం సాయంత్రం గాలి వాన బీభత్సం సృష్టించింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత ఎక్కువగా ఉండి సాయంత్రం ఒక్కసారిగా వాతవరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. పెనుగాలులకు గ్రామాల్లో అక్కడక్కడ చెట్లు విరిగి పడ్డాయి. దాదాపు 30 నిమిషాల పాటు పెనుగాలులతో కూడిన వర్షం కురిసింది. అదేవిధంగా కునుకుంట్ల గ్రామ సమీపంలో ఓ టెంకాయ చెట్టుపై పిడుగు పడింది. దీంతో పక్కనే ఉన్న గడ్డివామి దగ్ధమైంది. వెంటనే స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు మంటలార్పారు.

గాలీవానకు కూలిన విద్యుత్ స్తంభాలు

ప్యాపిలి: మండలంలో ఆదివారం మధ్యాహ్నం గాలీవాన బీభత్సం సృష్టించింది. కలచట్ల, ఎన్ రంగాపురం, గార్లదిన్నె, అలేబాదు, ఏనుగుమర్రి తదితర గ్రామాల్లో ఈదురు గాలుల ధాటికి 15 విద్యుత్ స్తంభాలు కూలినట్లు సమాచారం. గాలుల ధాటికి చెట్లు కూడా విరిగి పడ్డాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వెంటనే ఆయా గ్రామాల్లో విద్యుత్‌ను పునరుద్ధరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ వినయ్ కుమార్ తెలిపారు.

వడగండ్ల వాన

డోన్ టౌన్: మండలంలోని ఆదివారం సాయిత్రం గ్రామాల్లో వడగండ్లతో కూడిన మోస్తరు వర్షం కురిసింది. కొత్తకొట, కొత్తబురుజు గ్రామాల్లో ఈదురుగాలులు వండగండ్లతో కూడిన వర్షం కురిసినట్లు ఆయా గ్రామస్తులు తెలిపారు. కొత్తకొట గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై వెలసిన శ్రీగిద్దాంజనేయ స్వామి దేవాలయం ప్రక్కన ఉన్న మునేంద్ర నర్శిలో పెద్ద సైజు వడగండ్లు పడ్డాయి. వడగండ్ల వర్షం మూలంగా టమాట, మిరప నార బాగా దెబ్బతిందని నిర్వాహకుడు వాపోయాడు.

తిమ్మనాయినపేటలో..

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని తిమ్మనాయినపేటలో ఆదివారం వడగండ్ల వాన కురిసింది. ఉదయం నుంచి ఎండతీవ్రత అధికంగా ఉండేది. సాయంత్రం ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. ఇరవై నిమిషాల పాటు గాలులతో కూడిన వడగండ్లవాన కురిసింది. దాదాపు 15 ఏళ్ల తర్వాత గ్రామంలో వడగండ్ల వాన కురిసిందని గ్రామస్తులు పేర్కొన్నారు. కొలిమిగుండ్లతో పాటు పలు గ్రామాల్లో గాలులు వీచి తేలిక పాటి జల్లులు కురిశాయి.

వైఎస్సార్‌సీపీ మద్దతుదారులపై టీడీపీ కార్యకర్తల దాడి

అవుకు: మండల పరిధిలోని కునుకుంట్ల గ్రామంలో ఆదివారం సాయంత్రం తేదేపా కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ మద్దతుదారులపై దాడి చేసిన ఘటన చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఇస్రానాయక్ తండా గ్రామానికి చెందిన దేవేంద్ర నాయక్ బైక్‌పై వెళ్తున్నాడు. అదే గ్రామానికి చెందిన గోవింద్ నాయక్ కాలిపై బైక్ ఎక్కించి ఆపకుండా వెల్లాడు. దీంతో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు గోవింద్ నాయక్, జయరాంనాయక్ అతన్ని వెంబడించి కునుకుంట్ల వద్ద బైక్ ఆపి నిలదీస్తున్నారు. ఈ నేపథ్యంలో కునుకుంట్ల గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు అనవసరంగా జోక్యం చేసుకుని వీరిపై దాడికి పాల్పడ్డారన్నారు. మమ్మల్ని దుర్భాషలాడుతూ కర్రలతో, రాళ్లతో దాడి చేశారన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించి మాపై దాడి చేయించిన, చేసిన కునుకుంట్ల గ్రామానికి చెందిన డబ్బాల గోపాల్, కలికాల ప్రసాద్, తెల్లప్ప కంబగిరిస్వామి, కలికాల రామచంద్రుడు, నారాయణ, వెంకటేశ్వర్లు, రామకోటి, లక్ష్మినారాయణలపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

బేతంచెర్ల: ప్రాచీనకాలం నుంచి నేటి వరకు గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని గ్రంథాలయ అధికారి మధు శేఖర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు గ్రంథాలయాల ప్రాముఖ్యత, విద్య ప్రయోజనాలను ఆయన వివరించారు. గ్రంథాలయాలకు రావడం దినచర్యగా చేసుకోవాలన్నారు. అదేవిధంగా విద్యార్థులకు క్విజ్, చెస్ పోటీలను నిర్వహించారు.

వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

నంద్యాల(అర్బన్): వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చి రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని వడ్డెర సంఘం జిల్లా నాయకుడు చల్లా వెంకటేష్ కోరారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ ఎస్టీ జాబితాలో చేర్చాలని ఇప్పటికే పలుమార్లు ప్రభుత్వాలకు విన్నవించుకున్నా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. పట్టణంలో సంఘం భవన నిర్మాణానికి స్థలంతో పాటు నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.